
*ఈ వారం ఈ శీర్షికలో కథల ఎన్నికల గెస్ట్ ఎడిటర్ : శ్రీ తిరుమలశెట్టి శ్రీరాములు.*



ఆ పేరు వినగానే ఆకాశవాణి మనసులో మెదలుతుంది ఎవరికైనా! అయన గళంతో నేకాదు కలంతోకూడా సాహితీ సేవ చేశా రనడానికి నేషనల్ బుక్ ట్రస్ట్ ప్రచురించిన ఉద్గ్రంథాలే నిదర్శనం!

మాస్కో, ఢిల్లీ హైదరాబాద్ కేంద్రాల నుంచి తెలుగుభాషా సొగసుల్ని విశ్వవీధుల్లో వలలా విసిరి విశ్వజనాళి మనసుల్ని తన కైవశం చేసుకున్న స్వర సామ్రాట్, స్వర రత్న శ్రీ తిరుమంశెట్టి శ్రీరాములు ఈ వారం మన గెస్ట్ ఎడిటర్.

"చాలా కథలే:" అని ఆశ్చర్యపోయి నా, ఓపికతో చదివి ఈ రెండు కథల్ని ఎంపిక చేశారు. నిర్వికారమైన పఠనా పద్ధతితో, స్పష్టకు నెలవైన స్వరంతో అయనకు ఆయనే సాటిగా నిలిచిన ఈయన మీకు స్వాగతం పలుకుతున్నారు. రసాస్వాదన కానీయండిమరీ...!

# పేరు మీరేపెట్టండి

**అనేక పత్రికలు, నవలలు చదివే మీలోని ఊహాశక్తిని ఉపయోగించండి. ఈ కింది కథ చదివి దానికి ఏ పేరు పెడితే బావుంటుందో ఊహించి కింది బాక్సులో మీరే రాయండి.**

అర్ధరాత్రి పన్నెండుగంటల సమయం. దూరంగా వినిపించే రైలుకూత తప్పఅంతా ప్రశాంతంగా వుంది. ఇన్‌స్పెక్టర్ సంపత్ రూమ్‌లోంచి బైటకు నడిచేడు. అతను ఉద్యోగంలో జాయిన్ అయ్యి రెండు రోజులే అయింది. ఛార్జి తీసుకోగానే వచ్చిన మొదటి కేసు ఆ ఊళ్ళోని లాడ్జిని రైడ్‌చెయ్యాలని- చాలా ఉత్సాహంగా బయలుదేరేడు. అంతా చీకటిగావుంది. చేతిలో కాలే సిగరెట్ వెలుగు తప్ప. గబగబా నడక వేగం పెంచేడు. చాలా థ్రిల్లింగ్‌గావుంది. కానిస్టేబుల్స్‌తో వేన్‌లో బయలుదేరేడు. లాడ్జి దగ్గరయింది. మెట్లెక్కి లాడ్జిపై అంతస్తుకు నడిచేరు. మెల్లగా తలుపుతట్టి చెవిని తలుపుకానించేడు. ఏవో వింత శబ్దాలు వినిపిస్తున్నాయి. బ్రహ్మచారి కాదుకాబట్టి అవి అతనికి చిర పరిచితమే. ఎంత తట్టినా తలుపు తెరుచుకో లేదు. బలం అంతా ఉపయోగించి గట్టిగా బాదేడు. కొద్ది క్షణాల అనంతరం తలుపు తెరుచుకుంది. చేతిలోని కర్ర గాల్లో ఆడిస్తూ లోపలికి ప్రవేశించేడు. లుంగీ కట్టుకొంటూ ఓ పురుషుడు, చీరసర్దుకొంటూ ఓ స్త్రీ కనిపించేరు. పురుషుడు చాలా కంగారుగా కనిపించేడు. స్త్రీ మాత్రం నిర్లక్ష్యంగామంచం మీదే కూర్చొని వుంది.

ఎవరు మీరు? గట్టిగా అరిచేడు.- మేమిద్దరం భార్యాభర్తలం, వణుకును అణుచుకొంటూ చెప్పేడతను. వారి వాలకం చూస్తుంటే సంపత్‌కు అనుమానంవచ్చింది. హఠాత్తుగా అతని డిటెక్టివ్ బుర్రలో ఐడియా మెరిసింది. "మీ ఇంటోంచి లాడ్జికి ఎప్పుడొచ్చేరు? అడిగేడు-

"ఇవాళసాయంత్రమే వచ్చేం",-ఇద్దరూ దృఢంగా చెప్పేరు. అతణ్ణి ప్రక్కకు పిలిచి ప్రశ్నించేడు, "ప్రొద్దున్న మీ ఇంట్లో ఏం కూర వండుకున్నారు?" "వంకాయపప్పు, గోంగూర పచ్చడి" అతను చెప్పేడు ఆ తర్వాత ఆ స్త్రీని కూడా పక్కకు పిలిచి అదే ప్రశ్న వేసేడు. కాసేపు ఆలోచించి "గుత్తివంకాయకూర, సాంబారు" అన్నది. ఆమె సమాధానం విని వెంటనే ఇద్దర్నీ అరెస్టుచేసేడు.

**—డాక్టర్ మట్టా సుగుణరావు**

*స్రవంతి నెం: 17లో ఈశీర్షికలో ప్రచురించిన కథకి రచయిత శ్రీ ఎనుగంటి వేణుగోపాల్ పెట్టిన పేరు : ది రేప్*

# అడ్డంతిరిగిన కథ

"ఈరోజుతో తన పంట పండింది ఇకనుండి అన్నీ జాలీడేస్. ఓహో ఏమదృష్టం" అనుకుంటూ అప్పటికే నాలుగుసార్లు చదివిన ఉత్తరాన్ని మరోసారి తీసి చదవ సాగాడు.

"మై డియర్ సత్యం:

నువ్వు నన్ను ఎంతగా ప్రేమిస్తున్నావో, నీ ఉత్తరాలే నాకు తెలియపరుచుతున్నాయి. ఈ రోజు సాయంత్రం 6 గం॥కి నెహ్రూ పార్క్‌కి వస్తావుకదూ! నీకోసం ఎదురు చూస్తుంటాను.

ఉంటానుమరి
నీ దేవి.

దేవికి తనపై ఇన్నాళ్ళకు ప్రేమ కలిగింది. తను దేవికి రాసిన ఉత్తరాల పరంపరవలనే, ఇప్పుడు దేవి తనది కాబోతోంది,

దేవి రాసిన ఉత్తరాన్ని చదివిన సత్యం మనసు ఆనందాంబుధిలో ఓలలాడింది. సాయంత్రం 5 గం॥ వరకూ చదువుతూనే ఉన్నాడు.

సాయంత్రం 5 గం॥ కావడంతో సత్యం మేకప్ ప్రారంభించాడు. ఉన్నవాటిలో ఒక మంచి డ్రెస్ తీసి. దానికి సెంటు రాసి. నాలుగుసార్లు టక్‌ని సర్దుకొని సరిగ్గా ఆరో గంట అయ్యేసరికి నెహ్రూపార్క్ ముందు వాలాడు.

దేవికోసం సత్యం అతృతగా ఎదురు చూస్తున్నాడు. కపుల్స్ చాలామంది వస్తున్నారు, వెళ్తున్నారు, కానీ దేవి మాత్రం రావడంలేదు. దేవి తనని పార్క్‌కి రమ్మంది 6 గం॥ కేనా అన్న అనుమానంతో మళ్ళీ దేవి ఉత్తరాన్ని తీసిచూసాడు.

"దేవి రాసిన ఉత్తరంలో తప్పేమిలేదు. తనని రమ్మంది ఖచ్చితంగా 6 గంటలకే. నా దేవి నన్ను మోసం చెయ్యదు. తప్ప కుండా వస్తుంది. తనని ప్రేమసాగరంలో ముంచితేలుస్తుంది" అనుకుంటూ డన్‌లప్ లాంటి మెత్తని గడ్డిలో కృష్ణపరమాత్మలా పడుకొని దేవి రాకకోసం వెయ్యికళ్ళతో ఎదురుచూస్తున్నాడు.

దేవి రాకకోసం ఎదురుతెన్నులు చూస్తున్న సత్యం తనవీపుకి ఏదో తగల

డంతో వెనుతిరిగి చూసాడు.

ఎదురుగా ఇన్స్‌స్పెక్టర్, ఇద్దరు కానిస్టేబుల్స్.

"ఓయ్-మిస్టర్. యువర్ నేమ్ ప్లీజ్" అడిగాడు ఇన్స్‌స్పెక్టర్.

"సత్యం" చెప్పాడు.

"ఏ ఊరు"

"ఈ ఊరే సార్"

"స్వంత ఇల్లుందా నీకు"

"ఉంది సార్"

"అయితే స్వంత ఇల్లుండగా పార్కులో కొచ్చి పడుకోవడానికి కారణం ఏమిటి" అడిగాడు ఇన్స్‌స్పెక్టర్.

"ఏం లేదుసార్! ఈ రోజుతోనే నా ఎగ్జామ్స్ అయిపోయాయి సార్. రిలాక్సింగ్ కోసం ఇక్కడికొచ్చి పడుకొన్నాను సార్" అన్నాడు సత్యం.

"నీ నాటకాలు నాకు తెలియవనుకున్నావా! నీకెంతమంది స్మగ్లింగ్ ముఠాలతో సంబంధముందో నాకు తెలుసు. ముందు స్టేషన్‌కి పద" అంటూ సత్యం ఎంత రిక్వెస్టు చేస్తున్నా వినకుండా స్టేషన్‌కి తీసుకుపోయి లాకప్‌లో పడేసాడు ఇన్స్‌స్పెక్టర్.

* * * *

లాకప్‌లో ఉన్న సత్యాన్ని తీసుకు రమ్మని ఇన్స్‌స్పెక్టర్ చెప్పడంతో, ఇన్స్‌స్పెక్టర్ గదిలోకి తీసుకునివెళ్ళాడు హెడ్ కానిస్టేబుల్ కనకయ్య.

తనదగ్గరకు వచ్చిన సత్యాన్ని చూపిస్తూ ఇన్స్‌స్పెక్టర్, అక్కడే కూర్చున్న దేవితో "ఏమ్మా! నిన్ను ప్రేమిస్తున్నట్లుగా ఉత్తరాలు రాసి, నీ పరువు తీస్తున్నది, పైగా కాలేజీలో కూడా నిన్ను ఎక్కువగా ఏడిపిస్తున్నది ఇతనేనా" అడిగాడు.

"ఇతనేసార్! ఇతను ప్రతిరోజూ కాలేజీలో నా వెంటపడుతూనే ఉంటాడు సార్, మళ్ళీ ఉత్తరాలు రాస్తూ, నానాఅల్లరి చేస్తున్నాడు" అంటూ సత్యం తనకి రాసిన ఉత్తరాలు తీసి చూపించింది దేవి.

దేవి చూపించిన ఉత్తరాలవి చూసిన ఇన్స్‌స్పెక్టర్ సత్యంతో "సత్యం! నువ్వు కాలేజీలో ఏడిపిస్తున్నట్లుగా ఉత్తరాలద్వారా తనని వేధిస్తున్నట్లుగా దేవి మాకు కంప్లైంట్ ఇచ్చింది. దేవి నిన్ను ఈ రోజు 6 గం॥ రమ్మంటూ ఉత్తరం రాసాననీ, నన్ను నీపై తగిన చర్య తీసుకోమని కోరింది. ఆమె సలహా ప్రకారమే నేను పార్కుకి వచ్చి నిన్ను అరెస్టుచేసాను. ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకొని దేవికి క్షమార్పణ చెప్పు. లేకపోతే మీ ప్రిన్స్‌పాల్‌తో చెప్పి నిన్ను కాలేజీనుండి సస్పెండు చేయిస్తాను" అన్నాడు ఇన్స్‌స్పెక్టర్.

ఇన్స్‌స్పెక్టర్ మాటలకి భయపడిన సత్యం తప్పు క్షమించమంటూ దేవిని కోరాడు. ఇకెప్పుడు నిన్ను అల్లరిచేయనంటూ వాగ్దానం కూడా చేసాడు.

తనని సత్యం దారినుండి తప్పించినందుకు కృతజ్ఞతలు ఇన్స్‌స్పెక్టర్‌గారికి చెప్పి వెళ్ళిపోయింది దేవి.

వెళ్ళిపోయిన దేవి, వెనకాలే "కథ అడ్డం తిరిగింది" అనుకుంటూ స్టేషన్‌లోనుండి బయటపడ్డాడు సత్యం.

—ఇ.రామకృష్ణారావు
(విజయనగరం)

*స్రవంతి నెం: 15లో ఇచ్చిన*
**"స్వంత ఇల్లుండగా పార్కులో పడుకోవడానికి కారణం ఏమిటి?" ప్రశ్నించాడు ఇన్‌స్పెక్టర్ సత్యాన్ని.**
**వాక్యం ఆధారంగా రాసిన కథలు.**

## తీరని సమస్య

సత్యం ఉద్యోగరీత్యా చాలాకాలం నుంచి హైదరాబాద్‌లో ఉంటున్నాడు. అతనికి సుమారు 48 సం॥లు వుంటాయి. చామన ఛాయ రంగు, గుమ్మడికాయ లాగ పొట్టిగా ఉంటాడు. గుండ్రని ముఖం. స్వంత ఇల్లు కూడా ఉంది అతనికి. సత్యానికి ఒకే ఒక్క కూతురు. తల్లి చిన్నప్పుడే పోవటంచేత చాలా గారాబంగా పెరిగింది. సుజాత. యుక్త వయస్సు వచ్చేసరికి మంచి పెళ్ళి సంబంధం చూసి మద్రాసులో ఉంటున్న సురేష్‌కి ఇచ్చి పెండ్లి జరిపించాడు. సుజాత అత్తవారింటికి వెళ్ళిపోయిన తరువాత ఇల్లు అంతా అద్దెకు ఇచ్చి తను ఒక్కడూ ఒక్క గదిలో ఉంటున్నాడు. సుజాత పెళ్ళి అయిన తరువాత మొదటి పెద్ద పండక్కి కూతురుని, అల్లుడిని రమ్మని ఉత్తరం వ్రాసాడు. కాని అతనికి దిగులు పట్టుకున్నది. అతను ఉంటున్నది ఒక్క గదిలో. కూతురు, అల్లుడు వస్తే ఎక్కడ పడుకుంటారు, వాళ్ళకి ఈ గది ఇస్తే తను ఎక్కడ పడుకోవాలి? అన్న ఆలోచనలతో బుర్రనిండిపోయింది. ఈ లోగా కూతురు, అల్లుడు రానే వచ్చారు. సత్యం నిరాడంబరంగా పండగ జరిపించాడు. కూతురిని, అల్లుడిని తన గదిలో పడుకోమని తన స్నేహితుని ఇంట్లో పడుకుంటానని చెప్పి రాత్రి 8-00 గం॥లకు భోజనం చేసి బయటకు వచ్చాడు. ఆ రాత్రి సెకండ్ షో చూసి దగ్గరలో ఉన్న పార్కుకు పోయి పడుకున్నాడు. రాత్రి 12 గం॥ కావటంతో కానిస్టేబుల్ సత్యాన్ని తీసుకుపోయి కటకటాల వెనక్కునెట్టాడు. తెల్లవారిన తరువాత ఇన్‌స్పెక్టరు సత్యాన్ని పిలిచి అడగగా తనకు స్వంత ఇల్లుకూడా ఉందని చెప్పాడు. "స్వంత ఇల్లుండగా పార్కులో పడుకోవటానికి కారణం ఏమిటి?" ప్రశ్నించాడు ఇన్‌స్పెక్టరు సత్యాన్ని. దానికి జవాబుగా జరిగింది చెప్పి ఇంటికి చేరుకున్నాడు సత్యం— కానీ రెండో రాత్రి ఎక్కడ పడుకోవాలి అన్నదే అతనికి తీరని సమస్యయికూచుంది.

-ఎన్.ఎన్.వి.ఎస్.
ప్రకాశరావు
(అనంతపల్లి)

### ఓ కథ రాయండి

ఈ క్రింద ఇచ్చిన వాక్యాన్ని కథలో ఎక్కడయినా ఉపయోగించి అచ్చులో అరపేజీ మించకుండా ఓ కథని రాసి వెంటనే పంపండి. ప్రచురణార్హమైన కథా రచయితలకి పాతిక రూపాయలు పారితోషికం పంపబడుతుంది.

*"నీకు చెప్పడం ఇదే ఆఖరిసారి. మళ్ళీ ఇలాంటిది జరిగిందో వేరుగా ఉండటం ఖాయం" అంటూ భర్త గదిలోంచి విసవిసా వెళ్ళిపోయింది సుజాత.*